తెలంగాణ,
ఆంధ్రప్రదేశ్
బుధ వారం
11 జనవరి, 2023
సంపుటి - 07,
సంచిక-232
పేజీలు - 4
వెల రూ. 5/-

www.samasamajam.in

# సమ సమాజం

ప్రశ్నించే అక్షరం... ప్రజలకోసం...

తెలుగు దిన పత్రిక

ఎడిటర్ : గోసుకొండ వృద్ధిరాజు ○ Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Vishakapatnam, Vijayawada, Ongole

# సిఎస్ సోమేశ్‌కుమార్‌కు కేంద్రం షాక్

ఎస్ సోమేశ్ కుమార్ ఎపికి వెళ్లాల్సిందే ● కేంద్రం ఆదేశాల మేరకు హైకోర్టు తీర్పు ● తెలంగాణలో కొనసాగడంపై క్యాట్ ఉత్తర్వులను కొట్టివేత

**హైదరాబాద్, జనవరి 10 (సమ సమాజం):** తెలంగాణకు సీఎస్ సోమేశ్ కుమార్ కేటాయింపును రద్దు చేస్తూ హైకోర్టు తీర్పు ఇచ్చింది. చీఫ్ సెక్రటరీగా తెలంగాణలో సోమేశ్ కుమార్ కొనసాగింపును రద్దు చేస్తూ హైకోర్టు సీజే జస్టిస్ ఉజ్జల్ భూయాన్ బెంచ్ తీర్పు వెల్లడించింది. ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లాలని సోమేశ్ కుమార్‌ను కోర్టు ఆదేశించింది. రాష్ట్ర విభజన సమయంలో సోమేశ్ కుమార్‌ను కేంద్రం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి కేటాయిం చింది. దీంతో సోమేశ్ కుమార్ కేంద్ర పరిపాలన ట్రిబ్యునల్ క్యాట్‌ను ఆశ్రయించారు. ఈ క్రమంలో కేంద్రం ఉత్తర్వులు నిలిపివేసి తెలంగాణలో కొనసాగేలా క్యాట్ ఉత్తర్వులు జారీ చేసింది. క్యాట్ మధ్యంతర ఉత్వర్వులతో సోమేశ్ కుమార్ ఇంతకాలం తెలంగాణలో కొనసాగుతూ వచ్చారు. ఈ క్రమంలో క్యాట్ ఉత్తర్వులు కొట్టేయాలని 2017లో కేంద్రం హైకోర్టును ఆశ్రయించింది. క్యాట్ మధ్యంతర ఉత్తర్వులను కొట్టివేస్తూ హైకోర్టు సీజే ధర్మాసనం మంగళవారం తీర్పు వెల్లడించింది. సోమేష్ కుమార్ న్యాయవాది అభ్యర్థన మేరకు తీర్పు అమలు 3 వారాలు నిలిపివేసింది కోర్టు. 2019, డిసెంబర్ నుంచి తెలంగాణ సీఎస్‌గా సోమేశ్ కుమార్ కొనసాగుతున్నారు. మొత్తంగా సోమేష్ కుమార్ క్యాడర్ కేటాయింపు వివాదంపై న్యాయస్థానం కీలక తీర్పు ఇచ్చింది. కేంద్ర పరిపాలన ట్రిబ్యునల్ ఉత్తర్వులను కొట్టివేసింది. రాష్ట్ర విభజన జరిగినప్పుడు సోమేష్ కుమార్‌ను కేంద్రం ఏపీకి కేటాయించింది. అయితే కేంద్రం ఉత్తర్వులను నిలిపివేసి తెలంగాణలో కొనసాగేలా గతంలో క్యాట్ ఉత్తర్వులు ఇచ్చింది. క్యాట్ మధ్యంతర ఉత్తర్వులతో సోమేష్ కుమార్ తెలంగాణలో సీఎస్‌గా కొనసాగుతున్నారు.



## సిఎం కెసిఆర్‌తో సిఎస్ సోమేశ్ కుమార్ భేటీ



### హైకోర్టు తీర్పు నేపథ్యంలో పరిస్తితిపై చర్చ

**హైదరాబాద్, జనవరి 10 (సమ సమాజం):** హైకోర్టు తీర్పునేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేష్ కుమార్ సీఎం కేసీఆర్‌తో భేటీ అయ్యారు. సోమేష్ కుమార్‌ను ఏపీ కేడర్ కు వెళ్లాలంటూ కోర్టు ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో ఈ సమావేశం ప్రాధాన్యం సంతరించుకుంది. హైకోర్టు తీర్పు నేపథ్యంలో ఏం చేయాలన్న అంశంపై సీఎంతో సోమేష్ కుమార్ చర్చించినట్లు సమాచారం. మీటింగ్ అనంతరం హైకోర్టు తీర్పును ఆయన సుప్రీంకోర్టులో సవాల్ చేస్తారా లేదా అనే అంశంపై స్పష్టత వచ్చే అవకాశముంది. రాష్ట్ర

3వ

## ఆకాశాన్ని అంటుతున్న బంగారం ధరలు

భారీగా పెరిగిన బంగారం, వెండి రేట్లు

వరుసగా రెండోరోజు కూడా పెరిగిన ధరలు

57వేలు దాటిన 24 క్యారెట్ల బంగారం

**హైదరాబాద్, జనవరి 10 (సమ సమాజం):** బంగారం ధరలు రోజురోజుకూ ఆకాశాన్నంటుతున్నాయి. అడ్డూఅదుపు లేకుండా దూసుకుపోతున్నాయి. జెట్‌స్పీడ్‌లో ధరల పెరుగుదల కనిపిస్తోంది. గత మూడు నెలల్లోనే తులం ఐదువేల వరకు పెరిగిందని వ్యాపారులు చెబుతున్నారు. వెండి కూడా అదేస్థాయిలో పెరుగుతోంది. దేశంలో ఒక్కసారిగా బంగారానికి రెక్కలు వచ్చినట్లు ధరలు దూసుకుపోవడంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలకు కనుగోలు కష్టంగా మారింది. 24 క్యారెట్ల బంగారం ధర ఏకంగా రూ. 56 వేలు దాటేసింది. సోమవారం రూ.330



3వ

## ఇండోనేషియాలో భారీ భూకంపం

రిక్టర్ స్కేలుపై 7.7గా నమోదు

సునామీ ముప్పు లేదన్న శాస్త్రవేత్తలు



**తానింబర్, జనవరి 10 (సమ సమాజం):** ఇండోనేషియాలో మంగళవారం భారీ భూకంపం సంభవించింది. తానింబర్ ప్రాంతంలో మంగళవారం సంభవించిన భూకంపం తీవ్రత రిక్టర్

3వ

## జోషిమఠ్‌లో కూల్చివేతలు ప్రారంభం

ఇప్పటికే ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలింపు

పగుళ్లపై శాస్త్రేవేత్తల బృందం అధ్యయనం

**డెహ్రాడూన్, జనవరి 10 (సమ సమాజం):** ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని జోషిమఠ్ పట్టణంలో మంగళవారం ఇళ్ల కూల్చివేతలు ప్రారంభం అయ్యాయి. పగుళ్లు ఏర్పడిన ఇళ్లు, హోటళ్లను అధికారులు కూల్చివేశారు. ఇప్పటికే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. శాస్త్రవేత్తల పర్యవేక్షణలో సురక్షితం కాని నిర్మాణాలను కూల్చివేయాలని ఉత్తరాఖండ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ సందు ఉత్తర్వులు జారీ చేశారు. ఎముకలు కొరికే చలికాలంలో జోషిమఠ్ వాసులు వారి ఇళ్ల నుంచి బయటకు వచ్చి తాత్కాలిక ఆశ్రమాలకు వెళ్లారు. భూమి దిగబడటంతో జోషిమఠ్‌లో ఇళ్లపై పగుళ్లు ఏర్పడ్డాయి. పగుళ్లు ఏర్పడిన ఇళ్ల సంఖ్య 678కి పెరిగాయి. మరో 27 కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించామని విపత్తు నిర్వహణ అథారిటీ తెలిపింది. ఇప్పటి వరకు 82 కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. దెబ్బతిన్న ఇళ్లకు అధికారులు రెడ్ క్రాస్ మార్కులు వేశారు. బాధిత



3వ

## ఫిబ్రవరి తొలివారంలో అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ?

ఈ ఏడాదికి ఇవే చివరి సమావేశాలు

ఎన్నికల ఏడాది కావడంతో కేటాయింపులపై ఆసక్తి

కేంద్ర బడ్జెట్ ప్రకటించాకనే రాష్ట్ర బడ్జెట్‌కు కసరత్తు



**హైదరాబాద్, జనవరి 10 (సమ సమాజం):** తెలంగాణ అసెంబ్లీ బ్జడెట్ సమావేశాలు ఫిబ్రవరి తొలివారంలో నిర్వహించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఫిబ్రవరి 1న కేంద్ర బడ్జెట్ ప్రవేశ పెట్టనున్నారు. ఈ బడ్జెట్ తరవాత ఇక్కడ సమావేశాలను జరపాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఈ ఏడాదిలోనే మళ్లీ ఎన్నికలకు వెళ్లాల్సి ఉంటుంది. నవంర్‌తో అసెంబ్లీ ఎన్నికల సమయం ముగియనున్న నేపథ్యంలో ఇవే చివరి సమావేశాలు కానున్నాయి. దీంతో బడ్జెట్ సమావేశాల్లో తుది బడ్జెట్ కూడ కానుంది. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈ

3వ

## ఖమ్మంలో కంటివెలుగు రెండోదశ ప్రారంభం

సిఎం కెసిఆర్ చేతులమీదుగా ప్రారంభించాలని నిర్ణయం

సిద్దిపేటలో అధికారులతో సమీక్షించిన మంత్రి హరీష్ రావు




**సిద్దిపేట, జనవరి 10 (సమ సమాజం):** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రెండవదశ కంటివెలుగు ప్రారంభం ఖమ్మం జిల్లా నుంచి మొదలవుతుందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి సీఎం కేసీఆర్‌తో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన ముఖ్యమంత్రులు సైతం హాజరు కానున్నారని ఆయన తెలిపారు. మంగళవారం సిద్ధిపేట జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన కంటి వెలుగు అవగాహన సదస్సులో

3వ

## టీఎస్ఎస్‌పీ బెటాలియన్స్ అదనపు డీజీగా స్వాతిలక్రా

**హైదరాబాద్, జనవరి 10 (సమ సమాజం):** సీనియర్ ఐపీఎస్ అధికారి స్వాతి లక్రా టీఎస్ఎస్‌పీ బెటాలియన్స్ అదనపు డీజీగా బాధ్యతలు స్వీకరించారు. గత నాలుగు సంవత్సరాల నుంచి స్వాతి లక్రా తెలంగాణ మహిళా భద్రతా విభాగం అదనపు డీజీగా సేవలందించారు. టీఎస్ఎస్‌పీ అదనపు డీజీగా స్వాతి లక్రా బదిలీ కావడంతో.. ఆమెకు మహిళా భద్రతా విభాగం అధికారులు, సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. స్వాతి లక్రాపై



2వ

## బాపూజీ ఆశయాలను కొనసాగిస్తున్నాం

తంగళ్లపల్లిలో కొండా లక్ష్మణ్ విగ్రహావిష్కరణలో కెటిఆర్

**రాజన్న జనవరి 10 (సమ సమాజం):** ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలకు, ఆలోచనలకు అనుగుణంగా పని చేస్తున్నామని మంత్రి కేటీఆర్ అన్నారు. రాజన్న సిరిసిల్ల



3వ

## అమృత్‌సర్ స్వర్ణదేవాలయం సందర్శించిన రాహుల్

**చండీగఢ్, జనవరి 10 (సమ సమాజం):** కాంగ్రెస్ నేత రాహుల్ చేపడుతున్న భారత్ జోడో యాత్ర బుధవారం పంజాబ్‌లో ప్రవేశించనుంది. ఈ నేపథ్యంలో మంగళవారం ఆయన అమృతసర్‌లోని స్వర్ణ దేవాలయాన్ని సందర్శించారు. పంజాబ్ కాంగ్రెస్ చీఫ్ అమరీందర్‌సింగ్ రాజా వారింగ్, ప్రతిపక్ష నేత పర్తాప్ సింగ్ భజ్వా, స్థానిక ఎంపి గుర్జీత్ సింగ్ ఔజ్లా, ఇతర పార్టీ నేతలు ఉన్నారు. 116వ రోజు హర్యానాలోని అంబాలాలో జోడోయాత్ర ముగిసిందని ఈ సందర్భంగా సీనియర్ కాంగ్రెస్ నే జైరాం రమేష్ ట్వీట్ చేశారు.



## తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ

ప్రాణదాన ట్రస్టుకు పదిలక్షల విరాళం

**తిరుమల,జనవరి 10 (సమ సమాజం):** తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతుంది. వైకుంఠ ఏకాదశి ద్వార దర్శనానికి భక్తులు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం స్వామివారిని 56,003 మంది దర్శించుకోగా 20,365 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకల ద్వారా హుండీ ఆదాయం రూ. 3.89 కోట్లు వచ్చిందని టీటీడీ తెలిపారు. ఈ మేరకు విరాళం డీడీలను సంస్థ ప్రతినిధులు తిరుపతికి చెందిన రాఘవేంద్ర తిరుమలలోని గోకులం విశ్రాంతి భవనంలో టీటీడీ ఇవో ఎ వి.ధర్మారెడ్డికి అందజేశారు.

## సంపాదకీయం

# పరస్పర విమర్శలతో సమస్యలు పక్కదారి !

ఉభయ తెలుగు రాష్ట్రాల్లో బిజెపి రాజకీయాలు కేవలం అధికారమే లక్ష్యంగా సాగుతున్నాయి. ప్రధాని మోడీ పర్యటనకూడా కేవలం తెలంగాణలో అధికారమే లక్ష్యంగా సాగుతుందనడంలో సందేహం లేదు. తెలంగాణలో అనేక అభివృద్ధి కార్యక్రమాలను ఇప్పుడే చేపట్టడం వెనక ఎన్నికల సంక్షేమం దాగివుంది. విభజన సమస్యలపై మెల్లగా దాటవేస్తూ వచ్చిన బిజెపి పాలకులు ఇప్పుడా సమస్యలను కనుమరుగు చేసే పనిలో ఉన్నారు. దీనికిముందు విశాఖ ఉక్కును ప్రైవేటీకరణతో ప్రజల దృష్టిని మరల్చారు. అలాగే పోలవరంను మరింత జటిలంగాను..ఆలస్యంగానూ చేస్తున్నారు. నిధుల విడులలో జాప్యం చేస్తున్నారు. కావాలనే సమస్యలను పక్కదారి పట్టించే ప్రయత్నాల్లో పూర్తిగా సఫలం అయ్యారు. ఈ క్రమంలో సిఎం జగన్ కూడా వాటిని పట్టించుకోకుండా తన మానాన తాను పాలన చేసుకుంటూ పోతున్నారు. మళ్లీ అధికారంలోకి రావడ మే లక్ష్యంగా తన ప్రణాళికను అముల చేస్తున్నారు. ఇకపోతే తెలంగాణలో కూడా విమర్శల స్థాయిని బిజెపి పెంచింది. వీటికి దీటుగా అధికార బిఆర్ఎస్ నేతలు కూడా విమర్శల దాడిని పెంచారు. దీంతో తెలంగాణలో నిత్యం పరస్పర విమర్శలు చేసుకుంటున్నారు. దేనిపైనా ఇరు పార్టీల నేతలు స్పష్టత ఇవ్వడం లేదు. కేంద్రస్థాయి నాయకులు వచ్చి చేస్తున్న విమర్శలు కూడా దారుణంగా ఉంటున్నాయి. కెసిఆర్‌ను జైల్లో పెడతామని అంటున్న వారి ప్రకటనలు దారుణం కాకపోతే మరోటి కాదు. కెసిఆర్ ఏం తప్పుచేశాడని జైల్లో పెడతామని అంటున్నారో చెప్పాలి. బిజెపి నేలవిడిచి సాముచేస్తున్న తీరు ప్రజలకు కూడా ఏవగింపుగా కనిపిస్తోంది. ఏమీ చేయకుండానే ప్రజలు బిజెపికి పట్టం కట్టాలన్న దూకుడులో నేతలు ఉన్నారు. దూకుడు తో రాజకీయ ప్రాబల్యం పెంచుకునే ప్రయత్నాల్లో ఉన్నారే తప్ప ప్రజలకు మేలు చేసే ఆలోచనలో బిజెపి నేతలు లేరు. నిజానికి మోడీ చేసిన దానికన్నా మెరుగైన పనులనే తెలంగాణలో సిఎం కెసిఆర్ చేశారు. మోడీ కూడా ఇలాంటి పనులు చేసివుండరు. కెసిఆర్ తప్పులు చేసివుంటే వాటిని ప్రజల ముందుంచాలి. ప్రజలతో చర్చించాలి. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లాలి. అంతేగాని ఇలా బెదిరింపు రాజకీయాలు చేయడం సరికాదు. ఎపిలో కూడా చిల్లర రాజకీయాలకు పాల్పదుతున్నారు. జిన్నా టవర్ పేరు మార్చాలన్నది పెద్ద సమస్యగా చూపి ఆందోళన చేసి భంగపడ్డారు. అక్కడ రాజధాని అమరావతి సమస్య, విశాఖ స్టీల్ అమ్మకం తదితర విషయాలను పక్కన పెట్టడం తలదించుకోవాలి. ఎన్నికల సమయం లో మోడీ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు ఒక్కటయినా అమల య్యాయా లేదా అన్నది తెలుగు రాష్ట్రాల బిజెపి నేతలు స్పష్టం చేయాలి. విమర్శలు చేసేముందు మనమేం చేశామో ఆత్మవిమర్శ చేసుకోవాలి. బిజెపి నేతలు ప్రేలాపనలు మాని ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఒక్క హామీని కూడా నెరవేర్చడం లేదు. కనీసం నీటివాటాల పంచాయితీలను తెంపే విషయంలో కూడా తగిన చొరవ లేదు. బిజెపి చేస్తున్న రాజకీయాల వల్ల దేశానికే కాదు తెలుగు రాష్ట్రాలకు కూడా ఒరిగిందేమీ లేదు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో విభజన తరవాత చిన్నచిన్న సమస్యలను కూడా పట్టించుకోవడం లేదు. సమస్యల చిట్టా పట్టుకుని ఉభయ తెలుగు రాష్ట్రాల సిఎంలు, మంత్రులు కేంద్రం దగ్గరికి వెళితే కనీసం పరిష్కరించే చొరవ కూడా ప్రధాని మోడీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం చూపడం లేదు. రాష్ట్రాలను చిన్నచూపు చూడడం.. విపక్ష సిఎంలను పట్టించుకోక పోవడం...చూస్తున్నాం. ఇది నిరంకుశ విధా నాలకు తార్కాణంగా చూడాలి. నిజానికి దేశంలో ఏ ప్రాంతంలో అయినా ఏదైనా అభివృద్ది కార్యక్రమం చేపడితే అది దేశ అభివృద్దిలో భాగంగానే చూడాలి. కానీ ఇలాంటి మంచి పనుల విషయంలో కూడా బిజెపి ముందుకు రావడంలేదు. ప్రజాస్వామ్యంలో ప్రజలను ప్రభుత్వాలను అనుసంధానం చేసే బృహత్తర బాధ్యత కేంద్రంపై ఉంది. మోడీ అధికారంలోకి వచ్చిన తరవాత వీటిని పట్టించుకోవడం లేదు. నోట్లరద్దుతో దేశం ఎంతగా నష్టపోయిందో ఇప్పటికీ దాని పర్యవసానాలు చూస్తున్నాం. జిఎస్టీ తో ఇష్టం వచ్చినట్లుగా వాతలు పెడుతూ ఆదాయం పెరిగిందని మోడీ చంకలు గుద్దుకుంటున్నారు. నూలు పై జిఎస్‌టిని 5 శాతం నుంచి 12 శాతానికి పెంచాలని గత సెప్టెంబర్ లో జిఎస్‌టి మండలి తీసుకొన్న నిర్ణయాన్ని వాయిదా వేసుకున్నారు. చేనేత కార్మికులు విశేషంగా ఉన్న తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, గుజరాత్,పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలు ఒత్తిడి కల్పించినా పెడచెవిన పెట్టారు. తెలంగాణ రాష్ట్ర విభజన సమయాన కేంద్రం ఇచ్చిన హామీలన్ని వెంటనే అమలు చేయాలని, రాష్ట్ర అభివృద్ధి పట్ల బీజేపీ రాజకీయం మానుకోవాలని పదేపదే చేస్తున్న విజ్ఞప్తులను పక్కన పెట్టి చేస్తున్న దుందుడుకు రాజకీయాల కారణంగా బిజెపిని నమ్మడానికి ప్రజలు సిద్దంగా లేరని గుర్తిస్తే మంచిది. కేంద్ర ప్రభుత్వం ముమ్మాటికీ తెలుగు రాష్ట్రాల అభివృద్ధి పట్ల వివక్షత చూపుతుందనడంలో ఎలాంటి సందేహం అక్కర్లేదు. రాష్ట్ర విభజన చట్టం ప్రకారం బయ్యారంలో ఉక్కు ప్యాక్టరీ ఏర్పాటు చేస్తామని చెప్పి ఇంత వరకు అమలుకు నోచుకోలేదు. రాష్ట్రంలో బీజేపీని అణచడానికి సీఎం కేసీఆర్ కుట్రలు, కుతంత్రాలు చేస్తున్నారన్న బిజెపి నేతల ఆరోపణలు దుర్మర్గంగా ఉన్నాయి. కేసీఆర్ నిజాం, ఔరంగజేబు వారసత్వాన్ని కొనసాగిస్తున్నారని విమర్శించడం ద్వారా ప్రజల సానుభూతిని కొట్టేయాలని చూస్తున్నారు. రాష్ట్రంలో పోలీసు రాజ్యం నడుస్తోందంటున్న వారు కేంద్రంలో మోడీ అనుసరిస్తున్న విధానాలు ఎలా ఉన్నాయో చెప్పాలి. సాగుచట్టాలకు వ్యతిరేకంగా రైతులు ఆందోళనలకు దిగితే వారిని ఎలా అణచివేశారో చెప్పాలి. నిజానికి మోడీ తీరువల్లనే ప్రజాస్వామ్యం అపహాస్యం పాలవుతోంది. కేసీఆర్ నియంతలా వ్యహరిస్తు న్నారని చేస్తున్న ఆరోపణలకు ముందు మోడీ నిరంకుశంపై చర్చ చేయాలి. కేసీఆర్‌ను గద్దె దించేందుకు ప్రజలు సిద్ధమవుతున్నారని పదేపదే చెప్పి సానుభూతి పొందడం తప్ప మోడీ గొప్పల గురించి చెబితే ప్రజలు తగు సమాధానం ఇస్తారు. 2023 ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని అంటున్న వారు తెలంగాణ,ఏపిలకు చేసిన గొప్ప పనులేమిటో చెప్పాలి. కేసీఆర్‌ది కుటుంబ పార్టీ అంటున్న వారు మోడీ,షాలది ఏ పార్టీయో చెప్పాలి. వారిది ఆదానీ, అంబానీల పార్టీయా చెప్పాలి. దేశాన్ని దోచుకుని పారిపోయిన విజయ్ మాల్యా, నీరవ్ మోడీ లాంటి వారితో ఉన్న సంబంధాలపై బీజేపీ ప్రజలకు సమాధా నం ఇవ్వాలి. దేశంలో ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయకుండా, ఉన్న ప్రభుత్వరంగ సంస్థలను అమ్మకానికి పెట్టి, నిరుద్యోగులను మోసం చేస్తున్నది నిజం కాదా తేల్చాలి. రాష్ట్రంలో కేసీఆర్ పాలనను చూసి ఎంతో నేర్చుకోవలసి ఉంది. కేసీఆర్ పెద్ద అవినీతిపరుడు, దగాకోరు అంటూ తీవ్ర స్థాయిలో మాట్లాదుతున్న బండి సంజయ్ తెలంగాణకు ఏం చేశారో చెప్పరు. దేశ ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం అయ్యింది. ప్రజలకు తినడానికే ఇబ్బందిగా మారింది. చిన్నిచిన్న సంస్థలు మూతపడ్డాయి. రైతులకు గిట్టుబాటు ధరలు రావండ లేదు. నిరుద్యోగం పెరిగింది. ఈ సమస్యలపై ముందు బిజెపి సమాధానం చెబితే బాగుంటుంది.

పృధ్విరాజ్ గోసుకొండ
ఎడిటర్

# ఆంధ్రులను అవమానించిన కెసిఆర్ ఎలా వస్తారు

- విశాఖ ఉక్కో కోసం ఉద్యమం చేయగలడా
- అన్యాయం చేస్తున్న బిజెపినపై పోరాటం చేస్తారా
- ఇరు రాష్ట్రాల విభజన సమ్యలను ముందే పరిష్కరిస్తారా
- ప్రత్యేకహోదా సాధన సమితి నేత చలసాని డిమాండ్



**విశాఖపట్టణం, జనవరి 10 (సమ సమాజం):** తెలంగాణ ఉద్యమసమయంలో కెసిఆర్ ఆంధ్రులను అనరాని మాటలు అన్నారని, ఆ విషయాన్ని కెసిఆర్ మరచిపోయినా ఆంధ్రులు మరవలేదని ప్రత్యేక హోదా విభజన హామీల సాధన సమితి నేత చలసాని శ్రీనివాస్ అన్నారు. ఆనాడు ఇష్టం వచ్చినట్లుగా ఆంధ్రలును తూలనాడారని అన్నారు. హీనంగా మాట్లాడారని అన్నారు. అయినా ఆంధ్రరప్రదేశ్ కలసి ఉండాన్న ఒకేఒక కోరికతో మిన్న కున్నామని అన్నారు. అలాంటి కెసిఆర్ ఇప్పుడు ఏ మొహంతో ఇక్కడకు వస్తారని అన్నారు. ఆనాడు చేసిన అవమానాలను కెసిఆర్ మరచిపోయినా ప్రజలు మరచిపోలేదన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో కేసీఆర్ మాటలకు... గాయపడని ఆంధ్రుడు ఉండరని అన్నారు. ఆంధ్రులకు క్షమాపణ చెప్పిన తర్వాతే. సీఎం కేసీఆర్ ఏపీలోకి అడుగుపెట్టాలన్నారు. తెలంగాణ సీఎం కేసీఆర్, జనసేన అధినేత పవన్ కల్యాణ్ పై కూడా చలసాని కీలక వ్యాఖ్యలు చేశారు. మంగళవారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ ముందుగా ఏపీ, తెలంగాణ సమస్యలు పరిష్కరించడానికి కేసీఆర్ చొరవ చూపాలన్నారు. ఏపీకి బీజేపీ చేస్తున్న అన్యాయంపై బీఆర్ఎస్ పోరాడగలదా చెప్పాలని ప్రశ్నించారు. స్టీల్ ప్లాంట్ పరిరక్షణ కోసం విశాఖలో సీఎం కేసీఆర్ దీక్ష చేయాలని కోరారు. ఉమ్మడి ఆస్తుల విషయంలో సీఎం కేసీఆర్ పట్టు విడుపులు చూపాలని చలసాని శ్రీనివాస్ అన్నారు. బీజేపీ చెర నుంచి జనసేన పార్టీ బయటకు రావాలని చలసాని శ్రీనివాస్ సూచించారు. పవన్ కల్యాణ్‌కు పోరాట పటిమ ఉందని, దేనికీ లొంగరని తెలుసునని అన్నారు. ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టకుండా ప్రజలు పవన్ కళ్యాణ్ సభలకు వస్తారన్నారు. పాచిపోయిన లడ్డు, దక్షిణభారత దేశానికి జరిగిన అన్యాయంపై పవన్ కళ్యాణ్ గతంలో మాట్లాడిన విషయాన్ని ఈ సందర్భంగా చలసాని గుర్తు చేశారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఇద్దరూ కలిసి విభజన హామీల కోసం పోరాటం చేయాలని, విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం తుదివరకు తాము పోరాటం చేస్తామని చలసాని శ్రీనివాస్ స్పష్టం చేశారు.

# మునిగడప వద్ద కాలువలో పడ్డ కారు

## ప్రమాదంలో ఐదుగురు దుర్మరణం





**సిద్ధిపేట, జనవరి 10 (సమ సమాజం):** జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. జగదేవ్‌పూర్ మండలం మునిగడప మల్లన్న ఆలయం వద్ద జరిగిన ప్రమాదంలో ఐదుగురు మృతి చెందారు. మునిగడప మల్లన్న గుడి మూలమలుపు వద్దనున్న గుంతలో కారు పడిపోయింది. ఈ ఘటనలో నలుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ప్రమాదం జరిగిన సమయంలో కారులో ఆరుగురు వ్యక్తులు ఉన్నారు. ఇద్దరు గాయపడగా.. ఆసుపత్రికి తరలిస్తున్న సమయంలో మరొకరు మృతి చెందారు. మరో వ్యక్తి తీవ్రంగా గాయపడగా.. పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. మృతుల్లో ఇద్దరు పిల్లలు, ఇద్దరు మహిళలు ఉన్నారు. వీరంతా యాదాద్రిజిల్లా బొమ్మలరామారం గ్రామానికి దిన వారని సమాచారం. వేములవాడకు వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదం జరిగింది.

# జిఎస్టీ లెక్కలు తప్పయితే రాజీనామా మొఖాన కొడతా

- కుర్‌కురేలు పంచిన కిషన్ రెడ్డి ఆరోపణలు చేయడమా
- రాష్ట్రానికి ఓ నాలుగు మంచి పనులయినా చేశారా
- ఇప్పుడు ట్రైలర్ మాత్రమే..2023లో అసలు సినిమా చూపిస్తాం
- మోడీ దేశానికి ఏంచేశాడని దేవుడయ్యాడో చెప్పాలి
- సెస్ పాలకమండి సభలో మంత్రి కెటిఆర్ ఘాటు విమర్శలు



**రాజన్నసిరిసిల్ల, జనవరి 10 (సమ సమాజం):** జిఎస్టీ వసూళ్లు, రాష్ట్రానికి కేటాయింపులపై కేంద్రంపై మంత్రి కెటిఆర్ మరోమారు మండిపడ్డారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి లక్ష్యంగా ఘాటు విమర్శలు చేశారు. తాను చెప్పే లెకకలు తప్పయితే మంత్రిపదవి విసిరి అవతల పడేస్తానని సవాల్ చేశారు. రాష్ట్రం నుంచి జీఎస్టీ కింద 3 లక్షల 68 వేల కోట్లు కేంద్రానికి కడితే.. లక్షా 68వేల కోట్లు మాత్రమే ఇచ్చారని కేటీఆర్ ఆరోపించారు. తాను చెప్పిన లెక్క తప్పని నిరూపిస్తే.. తన మంత్రి పదవికి రాజీనామా చేసి మీ మొఖాన పారేస్తానని కేటీఆర్ కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి సవాల్ విసిరారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో జరిగిన సెస్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఘన విజయం సాధించిన సందర్భంగా వినియోగదారులు, రైతులతో ఏర్పాటు చేసిన కృతజ్ఞత సభలో మంత్రి కేటీఆర్ మాట్లాడారు. సెస్ ఎన్నికల సమయంలో బండి సంజయ్ రూ.5కోట్లు తీసుకువచ్చాడని.. అభ్యర్థులు ఆగమై తనకు ఫోన్లు చేశారని చెప్పారు. డబ్బులు పంచినోళ్లే మళ్లీ బీఆర్ఎస్‌పై ఆరోపణలు చేస్తున్నారని కేటీఆర్ విమర్శించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిపై కెటిఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గుజరాత్ పైసలు ఎన్ని వచ్చినా.. కేసీఆర్‌నే ముఖ్యమంత్రిని చేయాలని రాజన్న సిరిసిల్ల జిల్లా దిశానిర్దేశర చేసిందన్నారు. సెస్‌లో గెలువలేనోడు రాష్ట్రంలో గెలుస్తారా?.. మొన్న చూసింది ట్రైలరే.. 2023లో అసలు సినిమా చూపిస్తాం అన్నారు. తెలంగాణలో బీజేపీని నడిపేవాళ్లు మూర్ఖులని.. మెదడు ఎక్కడుంది? మోకాళ్లలో ఉందా?.. దమ్ముంటే తమకంటే ఎక్కువగా మంచి పనులు చేసి ప్రజల మనసులను గెలవాలని హితవు పలికారు. రాజన్న సిరిసిల్ల జిల్ల అభివృద్ధిలో దేశం మొత్తంలోనే ఆదర్శంగా నిలిచిందన్నారు. పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా విద్యుత్‌ను సరఫరా చేయాలని, సిరిసిల్ల జిల్లా సెస్ పరిధిలో ప్రత్యేక విద్యుత్ ప్రణాళిక రూపొందించాలన్నారు. ఎన్ని నిధులైనా ఇప్పిస్తానన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ ఎవరికి దేవుడు.. నీకా గుజరాత్ కా అంటూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ని నిలదీశారు. పెట్రోల్, గ్యాస్ ధరలు పెంచినోడని, నల్లచట్టాలు తెచ్చి రైతులను చంపినోడు దేవుడట.. చేనేత మీద పన్నువేసినోడు దేవుడా అంటూ నిలదీశారు. డీజిల్, పెట్రోల్ ధరలు పెంచుతూ.. ఆర్టీసీ ధరలు పెంచొద్దంటారని.. మరి బస్సులు ఎలా నడుపమంటారని ధ్వజమెత్తారు. కేంద్ర ధరలు పెంచడంలో ఆర్టీసీ చార్జీలు పెరిగాయని స్పష్టం చేశారు. కర్ణాటక, మహారాష్ట్ర మధ్య సరిహద్దు గొడవ నడుస్తుందన్న కేటీఆర్.. ఆ రెండు రాష్ట్రాల్లో ఉన్నది బీజేపీ ప్రభుత్వమేనన్నారు. రాష్ట్రాలగొడవ పరిష్కరించని మోదీ రష్యా, ఉక్రెయిన్ యుద్ధం ఆపారా అని ప్రశ్నించారు. 14 మంది ప్రధానులు చేసిన అప్పు.. ఎంతో ..అంతమొత్తం మోదీ ఒక్కరే చేశారని విమర్శించారు. కిషన్‌రెడ్డి కరోనా సమయంలో కుర్‌కురే ప్యాకెట్లు పంచారని విమర్శించిన కేటీఆర్.. తెలంగాణకు కేంద్ర నిధుల విషయంలో సవాల్ విసిరారు. రాష్ట్రం నుంచి కేంద్రానికి రూ.1.68లక్షల కోట్లు వెళ్లాయని, కేంద్రం తెలంగాణకు రూ.2లక్షల కోట్లు ఇచ్చిందన్నారు. నేను చెప్పింది తప్పని నిరూపిస్తే మంత్రి పదవికి రాజీనామా చేస్తానన్నారు. తన మంత్రి పదవికి రాజీనామా చేసి మీ మొఖాన పారేస్తానని కేటీఆర్ కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి సవాల్ విసిరారు. గుజరాత్ వాళ్లు వస్తే చెప్పులు మోయడానికి పని చేస్తారని, నాలుగేళ్లలో కరీంనగర్‌కు ఎంపీగా ఉండి బండి సంజయ్ ఏం చేశాడో చెప్పాలని డిమాండ్ చేశారు. ట్రిపుల్ ఐటీ, నవోదయ పాఠశాలలు తీసుకువచ్చావా? అంటూ నిలదీశారు. రాజరాజేశ్వరస్వామికి రూ.10 చందా అయినా రాయించావా? అంటూ ధ్వజమెత్తారు. ఈ సారి కరీంనగర్ పార్లమెంట్‌పై గులాబీ జెండాను ఎగురవేద్దామని, సిరిసిల్ల నుంచి విజయయాత్ర ప్రారంభించి.. ఇక్కడి నుంచే కరీంనగర్ గులాబీ జెండా ఎగురవేద్దామని కేటీఆర్ పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన స్వచ్ఛ్ సర్వేక్షణ్‌లో సిరిసిల్ల ప్రథమ స్థానంలో ఉన్న విషయాన్ని కేటీఆర్ గుర్తుచేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 33 జిల్లాలకు సిరిసిల్ల ఒక దిక్సూచి అని చెప్పారు. 14 మంది ప్రధానులు చేసిన అప్పు కన్నా మోడీ 100 రెట్లు ఎక్కువ చేసినా రాష్ట్రానికి మాత్రం మొండి చేయి చూపారని కేటీఆర్ విమర్శించారు. దేశంలో 20 అత్యుత్తమ గ్రామ పంచాయితీల్లో 19 తెలంగాణలో ఉన్నాయన్న కేటీఆర్ అయినా బీజేపీ నేతలు రాష్ట్రాభివృద్ధిపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. నిజం చెప్పులేసుకునే లోపు అబద్ధం ఊరంతా తిరిగి వస్తుందని.. అందుకే అలాంటి అబద్దాలను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. మోడీ గుజరాత్ దోస్తుల కోసమే దేశాన్ని నడిపిస్తున్నారని కేటీఆర్ విమర్శించారు. 12 లక్షల కోట్ల రుణాలను కార్పొరేట్ దోస్తులకు మాఫీ చేశారన్నారు. తాను చెప్పేది అబద్ధం అయితే దేనికైనా రెడీ అని స్పష్టం చేశారు. కేసీఆర్ అప్పుతో పాటు అభివృద్ధి కూడా చేశారని చెప్పారు. ఈ సభలో మాజీ ఎంపి వినోద్ తదితరులు పాల్గొన్నారు.

# నాకు గాడ్‌ఫాదర్ తెలంగాణ ప్రజలే

బిఆర్ఎస్‌లో మనిషిగా కూడా విలువనివ్వలేదు● అధికార మదంతో విర్రవీగుతున్నారు● నిరంతరం ప్రజల్లోనే ఉంటున్నా

● అక్రమాలతో పైకి రాలేదు..కష్టపడి వచ్చా● పార్టీ మారాక అవమానాలపై వివరిస్తా● ఆత్మయ సమావేశంలో పొంగులేటి సంచలన వ్యాఖ్యలు

**ఖమ్మం, జనవరి 10 (సమ సమాజం):** ప్రజల ఆశీర్వాదం ఉంటే పదవులు అవే వస్తాయని మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. అధికారం లేకున్నా నిత్యం ప్రజల్లోనే ఉన్నానని చెప్పారు. తన అభిమానులు, అనుచరులతో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో పొంగులేటి మాట్లాడారు. కేసీఆర్,కేటీఆర్‌పై నమ్మకంతోనే నాడు టీఆర్ఎస్‌లో చేరానని వెల్లడించారు. బీఆర్ఎస్ పార్టీ హైకమాండ్ తీరుపై శ్రీనివాస్‌రెడ్డి పరోక్షంగా తీవ్ర ఆరోపణలు చేశారు. పదవులు ఇచ్చినా ఇవ్వక పోయినా మనిషిని మనిషిలా చూడాలని కోరారు. పినపాక నియోజకవర్గ మద్దతుదారులతో ఖమ్మంలో పొంగులేటి ఆత్మీయ సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన తీవ్ర ఆవేదనతో పలు కీలక వ్యాఖ్యలు చేశారు. అధికార మదంతో రెచ్చిపోయినా... ప్రజలు తీర్పు ఇచ్చే రోజు ఎంతో దూరంలో లేదన్నారు. కష్టాలు చెప్పుకుంటేనే ఉలిక్కిపడుతున్నారని వ్యాఖ్యానించారు. కేవలం కేటీఆర్‌తో ఉన్న చనువుతోనే ఇంతకాలంలో బీఆర్ఎస్‌లో కొనసాగినట్లు చెప్పుకొచ్చారు. పార్టీ మారిన తర్వాత ఎలాంటి కష్టాలొచ్చాయో సమయం వచ్చినప్పుడు చెబుతానని పొంగులేటి వెల్లడించారు.తనకు రాజకీయాల్లో గాడ్ ఫాదర్ ఎవరూ లేరు.. తెలంగాణా ప్రజలే గాడ్ ఫాదర్ అని పొంగులేటి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన తనుపార్టీమారడం ఖాయమన్న సంకేతాలు ఇచ్చారు. ఇక బిఆర్ఎస్‌తో తెగదెంపులు చేసుకుంటున్నట్లు ఆయన వ్యాఖ్యలను బట్టి అర్థం అవుతోంది. తాను ప్రజలను ఆదరించేందుకు వెళితే దాన్ని కూడా మరో కోణంలో చూశారు. మీకు మంచి చేయడం రాదు. చేసే వాళ్లను అడ్డుకుంటారు. నేను ఈ రోజు గంగిరెద్దు లా రాలె. గత తొమ్మిదిన్నర సంవత్సరాలుగా ప్రజల్లో ఉన్నా. నేను సెక్యూరిటీ అడగలేదు. ఉన్న సెక్యూరిటీని తగ్గించిన నాకు ఇబ్బంది లేదు. నేను ఏమి అరాచకాలు చేయలేదు. గతంలో నూ ఆయన ఇలాంటి కామెంట్లే చేశారు. చేపలు నీళ్ళల్లో ఉండటం సర్వసాధరణమన్న ఆయన.. నీళ్లల్లో ఉండే చేప బయటకు వస్తే బతకదన్నట్లు.. రాజకీయ నాయకుడు ప్రజల్లో ఉన్ననాడే, వారితో మమేకమై, అభిమానం పొందిననప్పుడే నాయకుడిగా రాణించగలుగుతాడని అన్నారు. నాలుగున్నర ఏళ్లలో ఏ పదవి లేకపోయినా, జనం నుంచి అపూర్వ స్పందన వచ్చిందంటూ పొంగులేటి వ్యాఖ్యలు చేశారు. గడిచిన నాలుగేళ్లలో పార్టీలో ఏం గౌరవం పొందామో మీకూ తెలుసు. ప్రజల ఆశీస్సులతో కచ్చితంగా వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తా. లక్షల మంది అభిమానించే సైనికులు, అభిమానులు ఉన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ప్రతి గ్రామంలో తిరిగి ప్రజల్ని కలుస్తా. ఎన్ని కష్టాలు వచ్చినా ప్రజలను వదిలేది లేదు. నన్ను ఇబ్బంది పెట్టినా.. ప్రజల నుంచి వేరుచేయలేరు. నిజాన్ని అప్పుడూ నిర్భయంగా చెప్పాను, ఇప్పుడూ చెబుతాను.... నా వ్యాపార లావాదేవీలపై త్వరలోనే చెబుతాను అని వెల్లడించారు. నేను సెక్యూరిటీ అడిగితే మీరు ఇవ్వలేదు... ఇప్పుడు నా భద్రత తగ్గించినా నేను అడగను, ఉన్న ఇద్దరు గన్ మన్లను తీసేసినా నేను బాధపడను...నాకు సెక్యూరిటీ అవసరంలేదు అని పొంగులేటి శ్రీనివాసరెడ్డి వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా పొంగులేటి శ్రీనివాసరెడ్డి మరోసారి ఆసక్తికర వ్యాఖ్యలు శారు. చిన్న రైతు కుటుంబంలో జన్మించిన వ్యక్తినన్న ఆయన.. ఆ తరువాత కాంట్రాక్టర్‌గా పని చేసినట్లు చెప్పారు. భగవంతుడి ఆశీస్సుల తో ఆర్థికంగా ఎదిగినట్లు వివరించారు. డబ్బులు సంపాదించడమే కాకుండా పదిమందికి ఉపయోగ పడాలనేది తన ఉద్దేశ్యమన్నారు. తన నియోజక వర్గ పరిధిలో లేకపోయినా ఎప్పటి నుండో పినపాకతో సన్నిహితంగా ఉన్నానని.. కానీ కొందరు ఇప్పుడు ఇక్కడ ఏం పని అడుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను ప్రజల కోసం, కష్ట సుఖాలు తెలుసుకునేందుకు వస్తున్నట్లు.. నాడు కేసీఆర్ , కేటీఆర్ పిలుపుతో పార్టీలో చేరినట్లు తెలిపారు.



కానీ గత నాలుగు సంవత్సరాలుగా అనేక పరిణామాలు చోటుచేసు కున్నాయని, కేటీఆర్‌తో సాన్నిహిత్యంతో అవమానాలు జరుగుతున్నా ఓపిక పట్టామని చెప్పారు. తనతో పాటు, తనతో ఉన్న వాళ్లకు కనీస గౌరవం ఇవ్వలేదని కామెంట్ చేశారు. పార్టీ మార్పుపై మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అభిప్రాయాలు స్వీకరించే కార్యక్రమాన్ని చేపట్టారు. దీంతో ఆయన ఖమ్మం జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఉన్న తన శ్రేయోభిలాషులు, అభిమానులతో ఆత్మీయ సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా పినపాక నియోజకవర్గ నేతలతో పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఇదిలా ఉంటే ఆయన ఏర్పాటు చేసిన సమావేశం దగ్గర ప్లెక్సీల్లో ఇక్కడా కేసీఆర్, కేటీఆర్ ఫొటోలు లేవు. దీంతో పొంగులేటి.. బీజేపీలో చేరడం ఖాయమని.. ఇందుకు ప్లెక్సీలే నిదర్శనం అని పొంగులేటి మద్దతుదారులు అభిప్రాయపడుతున్నారు. ఈనెల 18న అమిత్ షా తో పొంగులేటి భేటీకానున్నారు. ఆ సమావేశం అనంతరం బీజేపీలో చేరాలా? వద్దా? అనేది నిర్ణయం తీసుకుంటారు. అనంతరం ప్రధాని మోదీ తో కూడా పొంగులేటి భేటీ అయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు ఈనెల 18న ఖమ్మంలో సీఎం కేసీఆర్ బహిరంగ సభ జరగనుంది. ఈ సభకు దేశ వ్యాప్తంగా పలువురు రాజకీయ ప్రముఖులు హాజరుకానున్నట్లు తెలుస్తోంది. ఓ వైపు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి.. అమిత్ షాతో భేటీ. మరోవైపు కేసీఆర్ ఖమ్మంలో సభ ఏర్పాటు చేయడం తెలంగాణ పాలిటిక్స్‌లో ఆసక్తి రేపుతోంది.తాను పార్టీ మారాల్సి వస్తే ఖమ్మం నడిబొడ్డున లక్షలాది మంది కార్యకర్తల సమక్షంలో కండువా కప్పుకుంటానని శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. సోమవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లి, చంద్రుగొండ మండలాల్లో పర్యటించి ఇటీవల చనిపోయిన కార్యకర్తల కుటుంబాలను, అనారోగ్యానికి గురైన వారిని పరామర్శించారు. అన్నపురెడ్డిపల్లిలో కార్యకర్తలు 'సార్? మీరు పార్టీ మారుతున్నట్లు మీడియాలో వార్తలు వస్తున్నయ్' అని అనగానే పై విధంగా స్పందించారు. 'నేను పార్టీ మారితే నాతో పాటు నా కార్యకర్తలంతా కండువాలు కప్పుకునేలా చేస్తా' అని అన్నారు.

# ఐనవోలు జాతరకు ఏర్పాట్లు

**వరంగల్, జనవరి 10 (సమ సమాజం):** ఐనవోలు జాతరకు భారీగా ఏర్పాట్లు చేశారు. ఐనవోలు మల్లికార్జున స్వామి, కొత్తకొండ వీరభద్రస్వామి జాతరలు జరుగనున్నాయి. ఈ జాతరలకు ప్రత్యేక బస్సులను నడిపేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. హన్మకొండ బస్టాండ్‌లో ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఇక్కడి నుంచి కొత్తకొండకు అదనపు సర్వీసులు నడపనున్నారు. ఇవి దేవాలయం సమీపానికి ప్రయాణికు లను చేరవేస్తాయని అధికారులు పేర్కొన్నారు. ఐనవోలు మల్లన్న జాతరకు ప్రత్యేక బస్సులు నడిపేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇవి వరంగల్ బస్‌స్టేషన్ నుంచి భక్తులను చేరవేస్తాయన్నారు. ఐనవోలు జాతరలో మొక్కులు సమర్పించుకున్న భక్తులు కొమురవెల్లికి వెళ్లడానికి బస్సులు అందుబాటులో ఉంచుతామన్నారు.



# టీఎస్ఎస్‌పీ బెటాలియన్స్ అదనపు డీజీగా స్వాతిలక్రా

(మొదటి పేజీ తరువాయి) పూలవర్షం కురిపించి, ఆమెపై తమకున్న అభిమానాన్ని చాటుకున్నారు. పోలీస్ మహిళా భద్రతా విభాగం చీఫ్‌గా ఏడీజీ శిఖా గోయెల్ సోమవారం బాధ్యతలు స్వీకరించిన సంగతి తెలిసిందే

# ఆకాశాన్ని అంటుతున్న బంగారం ధరలు



(మొదటి పేజి తరువాయి) పెరిగిన బంగారం ధర.. మంగలవారం కూడా అదే తరహాలో రూ. 330 పెరిగింది. ఇక హైదరాబాద్లో÷-నూ బంగారం ధరలో పెరుగుదల కనిపిస్తోంది. వెండి విషయానికి వస్తే..బంగారం దారిలోనే వెండి ధరలు కూడా చుక్కలు చూపుతున్నాయి. కిలో వెండిపై ఏకంగా రూ.500 పెరిగి ఆశ్చర్యానికి గురి చేస్తోంది.ప్రధాన నగరాల్లో బంగారం ధరలు ఇలావున్నాయి. న్యూఢిల్లీలో 10 గ్రాముల 22 క్యారెట్స్ బంగారం ధర రూ.51,600 కాగా, 24 క్యారెట్ల బంగారం ధర రూ.56,290 వద్ద కొనసాగుతోంది. చెన్నైలో 10 గ్రాముల 22 క్యారెట్స్ గోల్డ్ ధర రూ.52,370 ఉండగా, 24 క్యారెట్ల బంగారం ధర రూ.57,130 ఉంది. బెంగళూరులో 10 గ్రాముల 22 క్యారెట్స్ బంగారం ధర రూ.51,500 ఉండగా, 24 క్యారెట్ల బంగారం ధర రూ.56,180 వద్ద కొనసాగుతోంది. ముంబైలో 10 గ్రాముల 22 క్యారెట్స్ గోల్డ్ ధర రూ.51,450 కాగా, 24 క్యారెట్ల బంగారం ధర రూ.56,130 ఉంది. హైదరాబాద్లో 10 గ్రాముల 22 క్యారెట్స్ గోల్డ్ ధర రూ.51,450 కాగా, 24 క్యారెట్ల బంగారం ధర రూ.56,130 వద్ద కొనసాగుతోంది. విశాఖపట్టణం÷-లో 10 గ్రాముల 22 క్యారెట్స్ బంగారం ధర రూ.51,450 కాగా, 24 క్యారెట్ల బంగారం ధర రూ.56,130 వద్ద ఉంది. విజయవాడ?లో 10 గ్రాముల 22 క్యారెట్ల గోల్డ్ ధర రూ.51,450 కాగా, 24 క్యారెట్ల గోల్డ్ ధర రూ.56,130గా కొనసాగుతోంది. హైదరాబాద్లో కిలో వెండి ధర రూ.74,900, విజయవాడలో రూ.74,900, విశాఖపట్టణంలో కిలో వెండి ధర రూ.74,900, బెంగళూరులో రూ. 71,800, చెన్నైలో కిలో వెండి ధర రూ. 74,900, న్యూఢిల్లీలో కిలో వెండి ధర రూ.71,800గా కొనసాగుతోంది.

# ఇండోనేషియాలో భారీ భూకంపం



(మొదటి పేజి తరువాయి) స్కేలుపై 7.7గా నమోదైందని యూరోపియన్ మెడిటరేనియన్ సీస్మోలాజికల్ సెంటర్ ట్వీట్ చేసింది. ఈ భూకంపం వల్ల సునామీ ముప్పు లేదని శాస్త్రవేత్తలు చెప్పారు. ఇండోనేషియాలోని టువల్ ప్రాంతానికి నైరుతి దిశలో 342 కిలోమీటర్ల దూరంలో మంగళవారం తెల్లవారుజామున భూకంపం వచ్చింది. ఆస్ట్రేలియా, తైమూర్ లెస్టే, ఇండోనేషియాలలో సుమారు 14 మిలియన్ల మంది ప్రజలు భూప్రకంపనల బారిన పడ్డారు.ఈ భూకంపం తర్వాత మరిన్ని భూకంపాలు సంభవించవచ్చని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని యూరోపియన్ మెడిటరేనియన్ సీస్మోలాజికల్ సెంటర్ కోరింది. ఇండోనేషియాలోని జావా ప్రావిన్స్‌లో 5.6 తీవ్రతతో సంభవించిన భూకంపం కారణంగా కనీసం 318 మంది మరణించారు.పశ్చిమ జావాలోని సియాంజూర్ ప్రాంతంలో మధ్యాహ్నం 1:21 గంటలకు 5.6 తీవ్రతతో భూకంపం సంభవించిందని యునైటెడ్ స్టేట్స్ జియోలాజికల్ సర్వే తెలిపింది.

# జోషిమఠ్‌లో కూల్చివేతలు ప్రారంభం




(మొదటి పేజి తరువాయి) కుటుంబాలకు నెలకు 4వేల రూపాయలు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆర్థికసాయం అందించారు.ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి బాధిత ప్రాంతాలను సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. చమోలిలో భద్రత,రెస్క్యూ ఆపరేషన్ల కోసం అదనంగా 11 కోట్ల రూపాయలను విడుదల చేశారు. మరోవైపు పగుళ్లకు గల కారణాలను శాస్త్రవేత్తలు అధ్యయనం చేయనున్నారు.

# ఖమ్మంలో కంటివెలుగు రెండోదశ ప్రారంభం



(మొదటి పేజి తరువాయి) మంత్రి మాట్లాడారు. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు రాష్ట్రంలో కంటి సమస్యతో ఎవరు బాధపడవద్దని రెండవదశ కార్యక్రమం ప్రారంభిస్తున్నామని తెలిపారు. జనవరి 18 నుంచి జూన్ 30వరకు జరిగే రెండవదశ కంటివెలుగు కొనసాగుతుందని అన్నారు. తొమ్మిది నుంచి సాయంత్రం 4గంటల వరకు సోమవారం నుంచి శుక్రవారం కంటి పరీక్ష చేస్తారని మంత్రి చెప్పారు. జిల్లాకు అదనంగా 35మంది వైద్యులను రిక్రూట్ చేశామని పేర్కొన్నారు.ఉదయం ఇప్పటికే 10లక్షల కళ్ల అద్దాలు ప్రతి జిల్లాకు చేరుకున్నాయని వివరించారు. రెండో దశ కంటి వెలుగుకు రూ. 250కోట్లు ప్రభుత్వం ఖర్చు చేస్తుందన్నారు. జిల్లాలో 45 వైద్య బృందాలు, మరో మూడు అదనపు బృందాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రపంచం లోనే సామూహిక కంటి వెలుగు కార్యక్రమం తెలంగాణలో తప్ప దేశంలో ఎక్కడా లేదన్నారు.ఈ సమావేశంలో ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్సీలు ఫారుఖ్‌హుస్సేన్, యాదవ రెడ్డి, జడ్పీ చైర్మన్ రోజా శర్మ, ఎమ్మెల్యేలు ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి, ఒడితెల సతీశ్, ఎఫ్ డీ సీ చైర్మన్ ప్రతాప్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, డీఎంహెచ్‌వో కాశీనాథ్ ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

# బాపూజీ ఆశయాలను కొనసాగిస్తున్నాం



(మొదటి పేజి తరువాయి) జిల్లా తంగళ్ళపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహాన్ని మంత్రి మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం నూతనంగా నిర్మించిన మండల పరిషత్ కార్యాలయ భవనాన్ని ఎమ్మెల్సీ ఎల్.రమణ, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు వినోద్ కుమార్‌తో కలిసి మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలు, ఆలోచనలకు అనుగుణంగా పనిచేస్తున్నట్లు చెప్పారు. చేనేత కార్మికులకు ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అందిస్తోందన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీని ఆనాటి ప్రభుత్వం జలదృశ్యములో ఎక్కడ అవమానపరిచిందో అదే చోట బీఆర్ఎస్ ప్రభుత్వం బాపూజీ విగ్రహాన్ని ఆవిష్కరించి గౌరవించిందన్నారు. ప్రతి సంవత్సరం చేనేత దినోత్సవ రోజున బాపూజీ పేరుమీద 50 మంది చేనేత కళాకారులకు పురస్కారాలతోపాటు రూ.25వేలు అందిస్తున్నట్లు మంత్రి తెలిపారు.

# ఫిబ్రవరి తొలివారంలో అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ?



(మొదటి పేజి తరువాయి) ప్రభుత్వానికి చివరి బడ్జెట్ కానుంది. పైగా ఇది ఎన్నికల సంవత్సరం కావడంతో ఆచీతూచీ బడ్జెట్ రూపొందించాలని తెలంగాణ ప్రభుత్వం భావిస్తోంది. అంతేకాక ఫిబ్రవరి 1న పార్లమెంటులో ప్రవేశ పెట్టనున్న కేంద్ర బడ్జెట్‌ను క్షుణ్ణంగా పరిశీలించిన పిదప రాష్ట్ర బడ్జెట్ పై ప్రణాళికలు చేసే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఇకపోతే మార్చి 7న జరిగిన గతేడాది అంటే 2022-23 బడ్జెట్ ప్రవేశ పెట్టారు. ఈ సంవత్సరం 2023-24 బడ్జెట్ సమావేశాలను నెల ముందే జరపాలనే యోచనలో రాష్ట్రం ఉందని సమాచారం. బడ్జెట్ సమావేశాలను ఎన్ని రోజులు నిర్వహిస్తారు..ఎప్పటి నుంచి జరుపుతారన్న దానిపై ప్రబుత్వం నుంచి స్పష్టత రావాల్సి ఉంది. మరోవైపు ఫిబ్రవరి 1వ తేదీన కేంద్రం కూడా 2023-24 బడ్జెట్ ను పార్లమెంటులో ప్రవేశపెట్టనుంది. 2022-23 ఆర్థిక సంవత్సరానికి రూ.2,56,958 కోట్ల బడ్జెట్‌ను ప్రవేశ పెట్టిన తెలంగాణ ప్రభుత్వం.. 2023-24 బడ్జెట్ ప్రతిపాదనలను ఆహ్వానిస్తున్నట్టు ఆర్థికశాఖ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. అన్ని శాఖలు ఈ నెల 13వ తేదీలోపు తమకు ప్రతిపాదనలు పంపాలని, అలాగే 12వ తేదీలోపే అవి ముఖ్య కార్యదర్శులకు చేరాలని ఆదేశించారు. కాగా, ఇప్పటికే అమల్లో ఉన్న పథకాలతో పాటు 2022-23 బడ్జెట్ లో దళితబంధు కోసం కేటాయించిన నిధులను వినియోగించకపోవడం, ఆ పథకం రెండో విడత ప్రారంభం కాకపోవడం, గిరిజన బంధు కూడా ఇస్తామని సీఎం కేసీఆర్ గతంలో ప్రకటించడంతో వీటిపై అసెంబ్లీలో ఆయన ఏం చెబుతారో అన్న ఆసక్తి సర్వత్రా నెలకొంది. ప్రస్తుత ఏడాదిలో అంచనా వేసిన మేరకు కేంద్ర గ్రాంట్లు, అప్పులు అందడంలేదు. ఈ అంశాన్ని దృష్టిలో ఉంచుకునే బడ్జెట్ రూపకల్పన ఉంటుందని అధికారిక వర్గాలు చెబుతున్నాయి. ఎన్నికల సంవత్సరం కావడంతో ఆకర్శక పథకాలకునిధుల కేటాయింపు పెరిగే అవకాశం ఉంది. అలాగే దళితబంధు,గిరిజన బంధు, డబుల్ ఇళ్లకు కేటాయింపులు పెంచనున్నారు. ఇప్పటికే ఆర్థికమంత్రి హరీష్ రావు తనవద్ద ఉన్న సమాచారంతో కసరత్తు కూడా ప్రారంభించారు.

# మెట్రో పిల్లర్ కూలి తల్లీకొడుకుల దుర్మరణం

బెంగళూరు, జనవరి 10 (సమ సమాజం): బెంగళూరులో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. నిర్మాణంలో ఉన్న మెట్రో పిల్లర్ కూలి తల్లీ, కుమారుడు మృతి చెందారు. ఈ ఘటన నగరంలోని నగావరా ప్రాంతంలో మంగళవారం ఉదయం చోటు చేసుకుంది. బైక్‌పై వెళ్తున్న ఓ కుటుంబంపై మెట్రో పిల్లర్ పడటంతో వారు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు వెంటనే ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ.. 28 ఏళ్ల తేజశ్విని, ఆమె మూడేళ్ల కుమారుడు విహాన్ మృతి చెందారు. తేజశ్విని భర్త, కుమార్తె చికిత్స పొందుతున్నారు. సమాచారం అందుకున్న అధికారులు, పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.

# సిఎం కెసిఆర్‌తో సిఎస్ సోమేశ్ కుమార్ భేటీ



(మొదటి పేజి తరువాయి) విభజన సమయంలో ఐఎఎస్, ఐపీఎస్ అధికారులను కూడా డీఓపీటీ రెండు రాష్ట్రాలకు కేటాయించింది. సోమేష్ కుమార్ కు ఏపీ కేడర్ అలాట్ చేసింది. అయితే తాను తెలంగాణకు వెళ్తానని సోమేష్ కుమార్ చెప్పారు. తనను ఏపీకి కేటాయించడాన్ని సవాల్ చేస్తూ క్యాట్ లో పిటిషన్ దాఖలు చేశారు.ఈ పిటిషన్ పై విచారణ జరిపిన క్యాట్ సోమేష్ కుమార్ తెలంగాణలో కొనసాగేందుకు అనుమతించింది. 2017లో కేంద్రం క్యాట్ తీర్పును హైకోర్టులో సవాల్ చేసింది. దీనిపై విచారణ జరిపిన సీజే నేతృత్వంలోని డివిజన్ బెంచ్ సోమేష్ కుమార్ ను ఏపీ కేడర్?కు వెళ్లాలని ఆదేశిస్తూ తీర్పు చెప్పింది.

# జిల్లా ప్రజలకు కెసిఆర్ క్షమాపణలు చెప్పాలి

## అప్పుడే జిల్లాలో అడుగు పెట్టాలి: రేణుకా చౌదరి



ఖమ్మం, జనవరి 10 (సమ సమాజం): జిల్లా ప్రజానీకానికి సీఎం కేసీఆర్ క్షమాపణ చెప్పి ఖమ్మంలో అడుగు పెట్టాలని కాంగ్రెస్ సీనియర్ నేత రేణుకా చౌదరి అన్నారు. మంగళవారం ఆమె ఇక్కడ కాంగ్రెస్ కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ ముఖ్యమంత్రిని చూస్తే జాలికలుగుతోంది... టీఆర్ఎస్ అంట.. కేసీఆర్ చివరకు జర్నలిస్టులను సైతం మోసం చేశారని విమర్శించారు. ఖమ్మం జర్నలిస్టులకు నాలుగుసార్లు స్వయంగా తండ్రి కొడుకులు హామీ ఇచ్చి పట్టించుకోలేదన్నారు. ఛాలెంజ్ చేస్తున్నా.. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఎంపీ స్థానాలతో పాటు పది అసెంబ్లీ స్థానాలను గెలుచుకుంటామని ఆశాభావం వ్యక్తం చేశారు. బీజేపీకి అడ్రెస్సే లేదని.... దేశంలో చరిత్ర హీనులుగా మిగిలిపోయిన నేతలు ఇవాళ కథలు చెబుతున్నారని మండిపడ్డారు. ఈ దేశం కోసం కాంగ్రెస్ పార్టీ అనేక త్యాగాలు చేసిందన్నారు. ప్రధాని మోదీని సవాల్ చేస్తున్నా... ఈ దేశానికి బీజేపీ ఏం అభివృద్ధి చేసిందో చెప్పాలని... కాంగ్రెస్ ఏం చేసిందో తాను చెబుతానన్నారు. ఖమ్మం కాంగ్రెస్ జిల్లా అని, ఖమ్మం ప్రజలకు తాను అండగా ఉన్నానని అన్నారు. దేశంలో రెండుసార్లు ఓడిపోయామని....అది తమ స్వయంకృతమని, అందుకు చెంపలేసుకుని ప్రజల్లోకి వచ్చామని రేణుకా చౌదరి వ్యాఖ్యానించారు.

# విద్యార్థుల్లో చదువుపై ఆసక్తి పెంపొందించాలి

## కస్తూర్బా స్కూల్లో అదనపు గదులను ప్రారంభించిన మంత్రి

వికారాబాద్, జనవరి 10 (సమ సమాజం): విద్యార్థుల్లో చదువుపై ఆసక్తి పెంచేలా ఉపాధ్యాయులు బోధన చేయాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. వికారాబాద్ నియోజకవర్గం మోమిన్‌పేట్ మండలం,చంద్రయాన్ పల్లిలో రూ. 2 .05 లక్షలతో నిర్మించిన కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం అదనపు గదులు, ప్రయోగశాలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మట్టిలో మాణిక్యాలు ఉంటారని వారిని సాన బెడితే అణిముత్యాలు లాంటి విద్యార్థులు బయటకు వస్తారని అన్నారు. గతంలో అమ్మాయిలను చదివించటం కష్టంగా ఉండేదని, ప్రభుత్వం కల్పిస్తున్న వసతుల వల్ల నేడు విశ్వవిద్యాలయాలు అమ్మాయిలతో నిండి పోయాయని తెలిపారు.

# భార్యా భర్తల మధ్య అభిప్రాయభేదాలు

## క్షణికావేశంలో భార్య ఆత్మహత్య

## తల్లి ఆత్మహత్యతో కొడకూ ఆత్మహత్య

## కుటుంబంలో విషాదం నింపిన తల్లీ కొడుకుల ఆత్మహత్యలు

సిద్ధిపేట, జనవరి 10 (సమ సమాజం): క్షణికావేశం కళకళలాడుతున్న ఓ కుటుంబంలో కలకలం రేపింది. భార్య, భర్త, ఇద్దరు కొడుకులతో ఎప్పుడూ ఆనందోత్సాహాలతో ఉండే ఓ ఇంటిని అంద విహీనం చేసింది. ఒడి బియ్యం విషయంలో భర్తతో గొడవపడి భార్య క్షణికావేశంలో ఆత్మహత్యకు పాల్పడింది. తల్లి మరణంతో మనస్థాపానికి గురై పెద్ద కొడుకు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఒకే కుటుంబంలో ఉన్నట్టుండి ఇద్దరు ప్రాణాలు కోల్పోవడంతో ఆ ఇంట్లో సందడి స్థానంలో విషాదం నిండింది. తండ్రి, చిన్న కొడుకు ఇద్దరూ.. దూరమైన ఇద్దరి జ్ఞాపకాలతో ఒంటిరిగా మిగిలారు. సిద్ధిపేట పట్టణానికి సమీపంలోని చిన్న కోడూరు గ్రామానికి చెందిన నిమ్మల రాజు, సునీత (40) ఇద్దరూ భార్యాభర్తలు. వారికి విఘ్నేశ్ (21), వివేక్ అని ఇద్దరు కుమారులు. పెద్ద కొడుకు విఘ్నేష్ ఎంబీఏ చేస్తుండగా, చిన్న కొడుకు ఇంజినీరింగ్ చదువుతు న్నాడు. కౌలు రౌతు అయిన రాజు భార్యతో కలిసి వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుం టున్నాడు. డిసెంబర్ 5న ఒడిబియ్యం విషయంలో సునీత తన భర్త రాజుకు మధ్య గొడవ జరిగింది. ఈ గొడవతో తీవ్ర మనస్తాపానికి గురైన సునీత అదేరోజు క్షణికావేశంలో పురుగుల మందు తాగింది. దాంతో ఆమెను వెంటనే సిద్ధిపేటలోని ఓ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ డిసెంబర్ 8న మరణించింది.తల్లి మరణాన్ని పెద్ద కొడుకు విఘ్నేశ్ తట్టుకోలేకపోయాడు. మరణవార్త విన్నప్పటి నుంచి తీవ్రంగా కుంగిపోయాడు. అందుకే అంత్యక్రియలు ముగియగానే ఇంట్లో వాళ్లకు తెలియకుండా సిద్దిపేట లోని నర్సాపూర్ చౌరస్తా సమీపంలోగల ఎల్లమ్మ ఆలయం వద్దకు చేరుకున్నాడు. అక్కడి నుంచి తండ్రికి, బంధువులకు వీడియోకాల్ మాట్లాడాడు. అమ్మ చనిపోవడం తనకు చాలా బాధగా ఉందని, నాన్న ఆర్థిక ఇబ్బందులు చూడలేకపోతున్నానని చెప్పాడు. అందుకే తాను కూడా ఆత్మహత్యకు పాల్పడుతు న్నానని తెలిపాడు. ఇంతలో తండ్రి, బంధువులు వారిస్తున్నా వినకుండా వారంతా చూస్తుండగానే పురుగుల మందు తాగాడు. దాంతో రాజు, అతని బంధువులు షాకై వెంటనే చిన్నకోడూరు ఎస్ఐ శివానందంకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ శివానందం వెంటనే విఘ్నేశ్ ఉన్న లోకేషన్ గుర్తించి సిద్దిపేట టూ టౌన్ పోలీసులను అప్రమత్తం చేయగా.. పోలీసులు హుటాహుటిన ఘటనా ప్రాంతానికి చేరుకుని అపస్మారక స్థితిలో పడివున్న విఘ్నేశ్‌ను ఆస్పత్రికి తరలించారు. అప్పటి నుంచి సిద్దిపేటలోని సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఈ నెల 9న సోమవారం విఘ్నేశ్ చనిపోయాడు. అయితే, చనిపోయే ముందు తన ఇన్‌స్టాగ్రాం స్టేటస్, ఇతర సోషల్ మీడియా పోర్టల్‌లలో విఘ్నేశ్ పెట్టిన సందేశం చదివిన ప్రతి ఒక్కరిని కంటతడి పెట్టిస్తున్నది. తల్లితో కలిసి దిగిన ఫొటోకు ఆ సందేశాన్ని జతచేశాడు. అందులో ఏముందంటే.. 'స్వర్గంలో ఉన్న అమ్మా.. నేను నీ వద్దకు రావాలని కోరుకుంటున్నా. నిన్ను చేరేందుకు సిద్ధంగా ఉన్నా. రెండు చేతులు చాచి నన్ను నీ ఒడిలోకి తీసుకో..' అని రాసి ఉంది.చిన్న గొడవకు తల్లి క్షణికావేశానికి లోను కాకపోయి ఉంటే ఆత్మహత్య ఆలోచన వచ్చేది కాదేమో. తల్లి బతికివుంటే విఘ్నేశ్ కుంగిపోయేవాడు కాదేమో. ఇంత దారుణమైన నిర్ణయం తీసుకునేవాడు కాదేమో. కాగా, తల్లి మరణాన్ని, తండ్రి ఆర్థిక ఇబ్బందులను విఘ్నేశ్ ప్రస్తావించడం చూస్తే తల్లిదండ్రులిద్దరిపైనా అతనికి ఎంత ప్రేమ ఉన్నదో అర్థమవుతుంది. ఈ ఘటనతో గ్రామంలో ప్రతి ఒక్కరూ కంటతడి పెట్టారు.

# శ్రీలంక బౌలర్లను ఆడుకున్న రోహిత్ సేన

**బౌండరీలతో చెలరేగిన విరాట్ కోహ్లీ**

**సెంచరీ కొట్టిన కోహ్లీ.. 373 పరుగుల భారీ స్కోర్**




**గౌహతి, జనవరి 10 (సమ సమాజం):** గువాహటిలో శ్రీలంకతో జరుగుతున్న తొలి వన్డేలో టీమిండియా 373 పరుగల భారీ స్కోర్ చేసింది. స్టార్ ఆటగాడు విరాట్ కోహ్లీ శతకంతో చెలరేగాడు. తొలి బంతి నుంచి టాప్‌గేర్‌లో ఆడిన కోహ్లీ లంక బౌలర్లపై విరుచుకుపడ్డాడు. 80 బంతుల్లోనే 11 ఫోర్లు 1 సిక్సర్‌తో సెంచరీకి చేరువయ్యాడు. వన్డేల్లో కోహ్లీకి ఇది 45వ శతకం. అంతర్జాతీయ క్రికెట్‌లో 73వ సెంచరీ. శ్రేయాస్ అయ్యర్, రాహుల్‌తో కలిసి అంతను స్కోర్ బోర్డును 300 దాటించాడు. కోహ్లీ, రాహుల్ జోరు చూస్తే టీమిండియా 400 స్కోర్ చేసేలా కనిపించింది. అయితే.. రజిత బౌలింగ్‌లో రాహుల్ బౌల్డ్ అయ్యాడు. హార్దిక్ పాండ్యా 14, అక్షర్ పటేల్ 9 రన్స్ చేసి అవుట్ అయ్యారు. చివర్లో దూకుడుగా ఆడే క్రమంలో కోహ్లీ (113) ఏడో వికెట్‌గా వెనుదిరిగాడు. రజిత బౌలింగ్‌లో కీపర్ మెండిస్ క్యాచ్ అదుకోవడంతో అతని ఇన్నింగ్స్‌కు తెరపడింది. అంతకుముందు ఓపెనర్లు రోహిత్ శర్మ, శుభ్‌మన్ గిల్ హాఫ్ సెంచరీలు సాధించారు. దాంతో టీమిండియా నిర్ణీత ఓవర్లలో 373 పరుగులు చేసింది. టాస్ ఓడిపోయి బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు ఓపెనర్లు రోహిత్ (83), శుభ్‌మన్ గిల్ (70) శుభారంభం ఇచ్చారు. వీళ్లిద్దరూ తొలి వికెట్‌కు 143 పరుగులు జోడించారు. దసున్ షనక బౌలింగ్‌లో గిల్ ఎల్బీగా అవుట్ అయ్యాడు. కొంచెం సేపటికే హిట్‌మ్యాన్ మధుషనక బౌలింగ్‌లో బౌల్డ్ కావడంతో రెండో వికెట్ కోల్పోయింది. 28 రన్స్ చేసిన అయ్యర్ మూడో వికెట్‌గా వెనుదిరిగాడు. ఫామ్‌లేమితో ఇబ్బంది పడుతున్నకేఎల్ రాహుల్ (39) టచ్‌లో ఉన్నట్టే కనిపించాడు. కానీ, రజిత బంతిని సరిగా అంచనా వేయలేక వికెట్ సమర్పించుకున్నాడు. లంక బౌలర్లలో కసున్ రజిత మూడు వికెట్లు తీశాడు. మధుషనక, ధనుంజయ, షనక, కరుణరత్నే తలా ఒక వికెట్ పడగొట్టారు.

# సెంచరీతో కోహ్లీ ప్రపంచరికార్డు

**సచిన్ రికార్డును సమం చేసిన విరాట్**

**గౌహతి, జనవరి 10 (సమ సమాజం):** తొలి వన్డేలో క్లాస్ ఇన్నింగ్స్‌తో శతకం బాదిన విరాట్ కోహ్లీ ప్రపంచ రికార్డులు బద్ధలు కొట్టాడు. వన్డేల్లో 45వ, అంతర్జాతీయ క్రికెట్‌లో 73వ శతకం సాధించిన అతను టీమిండియా దిగ్గజం సచిన్ టెండూల్కర్ రికార్డును సమం చేశాడు. స్వదేశంలో 20 సెంచరీలు చేసిన రెండో బ్యాటర్‌గా గుర్తింపు సాధించాడు. స్వదేశంలో తక్కువ ఇన్నింగ్స్‌ల్లో 20 సెంచరీలు కొట్టిన బ్యాటర్‌గా రికార్డు క్రియేట్ చేశాడు. 99 ఇన్నింగ్స్‌ల్లోనే కోహ్లీ ఈ మైలురాయిని అందుకున్నాడు. మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ 20 సెంచరీలకు 160 ఇన్సింగ్స్‌లు తీసుకున్నాడు. సొంత గడ్డపై అత్యధిక శతకాలు బాదిన వాళ్లలో దక్షిణాఫ్రికా మాజీ ఆటగాడు హషీం ఆమ్లా (69 ఇన్నింగ్స్), ఆసీస్ మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్ (151 ఇన్నింగ్స్)తలా 14 శతకాలతో మూడో స్థానంలో ఉన్నారు.కే జట్టు మీద అత్యధిక సెంచరీలతో సచిన్ రికార్డును కోహ్లీ సమం చేశాడు. శ్రీలంక, వెస్టిండీస్ జట్ల మీద 9 సార్లు అతను వంద పరుగులు చేశాడు. సచిన్, ఆస్ట్రేలియా మీద 9 సెంచరీలు కొట్టాడు. రోహిత్ శర్మ, ఆసీస్‌పై 8 సెంచరీలతో మూడో స్థానంలో ఉన్నాడు. పోయిన ఏడాది బంగ్లాదేశ్‌తో జరిగిన మూడో వన్డేలో కోహ్లీ సెంచరీ కొట్టాడు. అదే ఫామ్‌ను కొనసాగిస్తూ గువాహటిలో జరుగుతున్న తొలి వన్డేలో శ్రీలంక బౌలర్లను ఉతికి ఆరేశాడు. 80 బంతుల్లోనే 11 ఫోర్లు 1 సిక్సర్‌తో సెంచరీకి చేరువయ్యాడు. దాంతో టీమిండియా 373 రన్స్ చేసి, లంక ముందు కొండంత లక్ష్యాన్ని పెట్టింది.






# ముంబై ఆటగాడు పృథ్వీ షా డబుల్ సెంచరీ

**ముంబై, జనవరి 10 (సమ సమాజం):** రంజీ ట్రోఫీలో భాగంగా అస్సాం, ముంబై జట్ల మధ్య జరుగుతోన్న మ్యాచ్ లో ముంబై ఆటగాడు పృథ్వీ షా డబుల్ సెంచరీ బాదాడు. పృథ్వీకి ఇది రెండో ఫస్ట్ క్లాస్ డబుల్ సెంచరీ కావడం విశేషం. 235 బంతులను ఎదురుకున్న పృథ్వీ షా డబుల్ సెంచరీని సాధించాడు. ఇందులో 28 ఫోర్లు, ఒక సిక్సర్ ఉన్నాయి. ముషీర్ ఖాన్‌తో కలిసి తొలి వికెట్‌కు 123 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పిన షా ముంబై జట్టుకు మంచి ఆరంభాన్ని అందించాడు.23 ఏళ్ల పృథ్వీ షా41 మ్యాచ్‌ల ఫస్ట్ క్లాస్ కెరీర్‌లో ఇప్పటివరకు 12 సెంచరీలు, 15 హాఫ్ సెంచరీలతో 3300 పైగా పరుగులు చేశాడు. 2018లో అంతర్జాతీయ క్రికెట్ లోకి అడుగుపెట్టిన పృథ్వీ షా.. ఇప్పటివరకు 5 టెస్టుల్లో 2 సెంచరీలు, 2 హాఫ్ సెంచరీలతో సహా 339 పరుగులు చేశాడు. ఇక 6 వన్డేల్లో 189 పరుగులు చేశాడు. వన్డేల్లో అతని అత్యుత్తమ స్కోరు 49 పరుగులు. పృథ్వీ షా జూలై 2021 నుంచి పరిమిత ఓవర్ల క్రికెట్‌కు దూరమయ్యాడు. ఇప్పటికీ వరకు మళ్లీ బీసీసీఐ అతన్ని మళ్లీ జట్టులోకి తీసుకోలేదు. చాలా కష్టపడుతున్నానప్పటికీ తనకి అవకాశాలు రాకపోవటం పట్ల పలుమార్లు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశాడు.


# అర్ధ సెంచరీని పెంపుడు కుక్కకు అంకితం

**మ్యాజిక్ అంటూ పెంపుడు పెట్ ను గుర్తు చేసుకున్న కోహ్లీ**



**గౌహతి, జనవరి 10 (సమ సమాజం):** శ్రీలంకతో తొలి వన్డేలో భారత కెప్టెన్ రోహిత్ శర్మ హాఫ్ సెంచరీతో రాణించాడు. ఆ ఇన్నింగ్స్‌ను అతను ఎవరికి అంకితం చేశాడో తెలుసా.. తన పెంపుడు కుక్కకు. అవును.. 50 పరుగులకు చేరుకోగానే రోహిత్ ఆకాశంకేసి చూస్తూ 'మ్యాజిక్' అని అన్నాడు. మ్యాజిక్.. అనేది అతని పెంపుడు కుక్క పేరు. విషయం ఏంటంటే.. సోమవారం అంటే 9ననే మ్యాజిక్ చనిపోయింది. దాంతో, తనకు ఎంతో ఇష్టమైన పెట్‌కు హిట్‌మ్యాన్ తన హాఫ్ సెంచరీని అంకితం చేశాడు. ఈరోజు ఉదయం రోహిత్ భార్య రితికా 'మాకు నిన్న చాలా కష్టమైన రోజు' అని సోషల్‌మీడియాలో పోస్ట్ పెట్టింది.గాయం నుంచి కోలుకున్న తర్వాత మొదటి మ్యాచ్‌లోనే అడుతున్న రోహిత్ అర్ధ సెంచరీ(83)తో మెరిశాడు. 67 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్సర్లతో కీలక ఇన్నింగ్స్ ఆడాడు. మరో ఓపెనర్ శుభ్‌మన్ గిల్‌తో కలిసి తొలి వికెట్‌కు 143 పరుగులు జోడించాడు. విరాట్ కోహ్లీ శతకం బాదడంతో భారత్ 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 373 రన్స్ చేసింది.



# బందిపోటు దొంగగా పవన్ కళ్యాణ్ ?

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ క్రిష్ కాంబోలో భారీ అంచనాలతో తెరకెక్కుతున్న హరిహర వీరమల్లు సినిమాలోపవన్ కళ్యాణ్ ఒక బందిపోటు దొంగగా కనిపిస్తారని టాక్. ఇక ఈ సినిమా కథ 17వ శతాబ్దంఔరంగజేబు సామ్రాజ్యం నాటి నేపథ్యంతో వస్తుంది. సినిమాలో పవన్ ఇదివరకు ఎప్పుడూ చూడని విధంగా లుక్స్ యాక్షన్ తో కనిపిస్తారని తెలుస్తుంది. ఇక సినిమాలో పవన్ దొంగగా కోహినూర్ వజ్రాన్ని దొంగిలిస్తారట. ఔరంగజేబు సామ్రాజ్యంలో ఉన్న కోహినూర్ ను పథకం ప్రకారం వీరమల్లు తన సొంతం చేసుకుంటారట. ఈ సీన్స్ సినిమాలో చాలా స్పెషల్‌గా సినిమాకు హైలెట్ గా ఉంటాయని తెలుస్తుంది. క్రిష్ ఈ సినిమాను చాలా ఫోకస్ తో తెరకెక్కిస్తున్నారు. పవన్ కెరీర్ లో డిఫరెంట్ మూవీగా హరి హర వీరమల్లు సినిమా వస్తుందన్నచర్చ సాగుతోంది. సినిమా అంతా ప్రేక్షకులకు ఒక అద్భుతమైన అనుభూతి అందిస్తుందని అంటున్నారు. ప్రేక్షకులకు కావాల్సిన వినోదంతో పాటుగా 17వ శతాబ్దం నాటి కథను కూడా క్రిష్ ఈ సినిమాతో చెప్పబోతున్నారు. సినిమాలో హీరోయిన్స్‌గా నిధి అగర్వాల్, జాక్వెలిన్ నటిస్తున్నారు. బాలీవుడ్ హీరోయిన్ నోరా ఫతేహి కూడా ఈ సినిమాలో స్పెషల్ రోల్ లో నటిస్తుందని తెలుస్తుంది. పవన్ ఈ సినిమా మీద పూర్తి నమ్మకంతో ఉన్నాడని తెలుస్తుంది. నిర్మాత ఏ.ఎం రత్నం కూడా సినిమాను ఎక్కడ కాంప్రమైజ్ కాకుండా ఖర్చు పెడుతున్నారు. పవన్ హరి హర వీరమల్లు సినిమా పాన్ ఇండియా మూవీగా వస్తుంది. సినిమా తప్పకుండా ప్రేక్షకుల అంచనాలకు తగినట్టుగానే ఉంటుందని చెప్పొచ్చు. సినిమాలో ఔరంగజేబు పాత్రలో బాలీవుడ్ స్టార్ బాబీ డియోల్ నటిస్తున్నారు.




# ఆస్కార్ అర్హతా చిత్రాల్లో కాంతారా

గతేడాది పలు సౌతిండియా సినిమాలు పాన్ ఇండియా స్థాయిలో అలరించిన విషయం తెలిసిందే. అందులో.. 'ఆర్‌ఆర్‌ఆర్', 'కేజీయఫ్ ఛాప్టర్ 2', 'కాంతారా' తో పాటు పలు చిత్రాలు ఉన్నాయి. వీటిలో 'కాంతారా' అయితే ఎటువంటి అంచనాలు లేకుండా వచ్చి సంచలన విజయాన్ని నమోదు చేసుకుంది. హోంబలే ఫిల్మ్స్ నిర్మించిన ఈ చిత్రంలో రిషబ్ శెట్టి హీరోగా నటించడంతోపాటు దర్శకత్వం వహించాడు. కేవలం రూ.16 కోట్ల బ్జడెట్‌తో తెరకెక్కిన ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా దాదాపు రూ.400 కోట్ల వసూళ్లు సాధించింది. కర్ణాటకలోని మంగుళూరుకి చెందిన 'భూతకోల' ఆధారంగా తెరకెక్కిన ఈ చిత్రానికి దేశవ్యాప్తంగా సినీ ప్రేక్షకులు కనెక్ట్ అయిపోయారు. ముఖ్యంగా సినిమా చివరి 20 నిమిషాల్లో రిషబ్ శెట్టి నటనకి ముగ్ధులయి పోయారనే చెప్పాలి. దీంతో ఎటువంటి ప్రచారం లేకుండా కేవలం మౌత్ టాక్‌తోనే మంచి విజయాన్ని సాధించింది. తాజాగా ఈ సినిమా మరో ఘనత సాధించింది. అది కూడా చాలా సైలెంట్‌గా. 'ఆస్కార్' అవార్డులకి ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్రేజ్ తెలిసిందే. ప్రతి మూవీ టెక్నీషియన్ ఒక్కసారైనా ఆ అవార్డుని అందుకోవాలని ఉవ్విళ్లూరుతారు. 'ఆస్కార్ 2023'కి 'కాంతారా' సినిమా రెండు విభాగాల్లో కంటెస్టేషన్ లిస్ట్‌లో చోటు సాధించింది. ఉత్తమ చిత్రం, ఉత్తమ నటుడు విభాగాల్లో టాప్ 15 జాబితాలో ఈ చిత్రం నిలిచింది. టాప్ 5లో నిలుస్తుందో లేదో చూడాలి. ఈ విషయాన్ని తెలుపుతూ.. 'కాంతారా' నిర్మాణ సంస్థ హోంబలే ఫిల్మ్స్ సోషల్ మీడియాలో ఓ ట్వీట్ చేసింది. అందులో.. 'కాంతారా'కి 2 ఆస్కార్ అర్హతలు లభించినందుకు ఆనందంగా ఉంది! మాకు మద్దతుగా నిలిచిన వారందరికీ హృదయ పూర్వక ధన్యవాదాలు. మీ అందరి మద్దతుతో ఈ ప్రయాణాన్ని పంచుకోవడం సంతోషంగా ఉంది. ఆస్కార్‌లో మెరవడానికి ఎదురుచూస్తున్నాం' అని రాసుకొచ్చింది. కాగా.. ఇప్పటి వరకూ గుజరాతీ చిత్రం 'ది ఛెల్లో షో', టాలీవుడ్ చిత్రం 'ఆర్‌ఆర్‌ఆర్' మాత్రమే ఆస్కార్ బరిలో ఉన్నాయని అందరూ అనుకున్నారు. సడెన్‌గా ఈ లిస్ట్‌లో 'కాంతారా' చేరడం విశేషం.




# హనుమాన్ ప్రమోషన్స్ స్టార్ట్

తేజ సజ్జ హీరోగా ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో రూపొందుతున్న సూపర్ హీరో మూవీ 'హనుమాన్'. అమృత అయ్యర్ హీరోయిన్. కె.నిరంజన్ రెడ్డి నిర్మిస్తున్నారు. షూటింగ్ పూర్తిచేసుకుని, పోస్ట్ ప్రొడక్షన్‌లో బిజీగా ఉన్న మేకర్స్, ప్రమోషన్స్ కూడా స్టార్ట్ చేశారు. ఇటీవల విడుదల చేసిన టీజర్‌కు మంచి రెస్పాన్స్ వచ్చింది. సోమవారం మూవీ రిలీజ్ డేట్‌ని అనౌన్స్ చేశారు. భారతీయ ఇతిహాసాల ఆధారంగా తెరకెక్కు తున్న ఈ చిత్రాన్ని మే 12న విడుదల చేస్తున్నట్టు సోమవారం ప్రకటించారు. 'ద మోస్ట్ పవర్‌ఫుల్ సూపర్ హీరో హనుమాన్' అంటూ మనదేశంతో పాటు అమెరికా, చైనా, జపాన్, యు.కె, స్పెయిన్, ఆస్ట్రేలియా, జర్మనీ, శ్రీలంక, మలేషియా దేశాల్లో తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ, మరాఠీ భాషల్లో సినిమా రిలీజ్ కానుందని అనౌన్స్ చేశారు. వరలక్ష్మీ శరత్‌కుమార్, వినయ్ రాయ్, గెటప్ శ్రీను, సత్య ఇతర ముఖ్య పాత్రల్లో కనిపించనున్నారు.

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8464816456 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in